**ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను**

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో నిర్భయంగా ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రికకు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను. బాన్సువాడ టౌన్. కామారెడ్డి టౌన్. బిచ్కుంద. బీర్కూర్. తాడ్వాయి. లింగంపేట. నస్రుల్లాబాద్. ఎల్లారెడ్డి. మండలాలకు రిపోర్టర్‌లు కావలెను.

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.


96665 56646



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నిజామాబాద్ కామారెడ్డి




# చేరికలపైనే దృష్టి



- వలసలను ప్రోత్సహిస్తున్న వివిధ పార్టీల నాయకులు
- ద్వితీయశ్రేణి నాయకులను చేర్చుకునేందుకు ఆరాటం
- వారిపైనే ఆధారపడుతున్న అభ్యర్థులు

**నిజామాబాద్, ఫిబ్రవరి 4 (ప్రజాజ్యోతి):** మునిసిపల్ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ వివిధ పార్టీల నేతలు చేరికలపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నారు. చేరికలను ఓట్లుగా మార్చుకొనే ఎత్తుగడతో వివిధ పార్టీల నుంచి విరివిగా వలసలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఒక పార్టీ నుంచి మరో పార్టీలో చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఈ ఒరవడిని అవలంభిస్తున్నాయి. వివిధ మునిసిపాలిటీ పరిధిలో ద్వితీయశ్రేణి నాయకులను చేరదీయడం ద్వారా ఎన్నికల్లో తమ బలం పెంచుకొనేం దుకు ముఖ్య నాయకులు ఆరాటపడుతున్నారు.

**- మచ్చిక చేసుకునే యత్నం...**

మునిసిపల్ ఎన్నికల్లో ఎక్కువ సంఖ్యలో వార్డులను కైవసం చేసుకునేందుకు వివిధ పార్టీల నాయకులు అన్ని దారులూ వెతుక్కుంటున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. వార్డుల వారీగా కొందరు చోటామోటా నాయకులను ఎంపిక చేసుకుంటున్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే బాధ్యతలను వారికి అప్పగిస్తున్నారు. దీంతో వార్డుల వారీగా నాయకులు డిమాండ్ చేసినంత ఇవ్వకతప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతానికి

-మిగతా 2లో..



## సీఎం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

### క్షేత్రస్థాయిలో పర్యటించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ రూరల్: ( ప్రజా జ్యోతి)** డిచ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్దిపూర్ గ్రామ శివారులో, కేశపురం గ్రామ పరిధిలో నేడు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభను పురస్కరించుకొని, నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్

-మిగతా 2లో..



## అభివృద్ధి చేస్తామని ఓట్లు అడుగుతారు కానీ వారు అభివృద్ధి చేయరు

-ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ
-వార్డుల్లో సుడిగాలి పర్యటన



ప్రజా జ్యోతి కామారెడ్డి టౌన్ ఫిబ్రవరి 5 మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో3, 4, 5, 8, 26, 29, 30, 31 వార్డులలో షబ్బీర్ అలీ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లా డుతూ అందరూ వచ్చి అభివృద్ధి చేస్తామని వాగ్దానాలు చేస్తారు.. కానీ మేము అభివృద్ధి చేసి, చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడుగుతున్నాం అని అన్నారు.?ముఖం చాటేసిన నాయకులకు బుద్ధి చెప్పండి,ఎన్నికల్లో

-మిగతా 2లో..

# చేరికలపైనే దృష్టి

వార్డుల వారీగా దావత్‌లు ప్రారంభం కాగా, ఎన్నికలకు ఒక రోజు ముందు పెద్ద మొత్తంలో నగదు, మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటికో క్వార్టర్ బాటిల్ చొప్పున మద్యం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధంకాగా, గ్రూపుల వారీగా సభ్యులు కోరే సామగ్రి ఇవ్వడానికి అభ్యర్థులు అంగీకరిస్తున్నారు.

ప్రధాన పార్టీల్లో నెలకొన్న పోటీని కొందరు ద్వితీయశ్రేణి నాయకులు అవకాశంగా మల్చుకుంటున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా డిమాండ్ల పేరిట అందినకాడికి దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీలు మద్దతునిస్తున్న పలువురు అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. తమ పరిధిలో ఇంతమంది ఓటర్లు ఉంటారని, వారిని మచ్చిక చేసుకునేందుకు ఇంతమొత్తం కావాలంటూ అభ్యర్థులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అలాగైతేనే పార్టీ మారతామంటూ అల్టిమేటం జారీ చేస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఇలా ఒక పార్టీ కాకుండా పోటీలో ఉన్న అన్ని ప్రధానపార్టీల మద్దతున్న అభ్యర్థులకు ఇదే పరిస్థితులు ఎదురవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్యాకేజీలు మాట్లాడుకుంటూ ఓట్లు వేయిస్తామనే హామీ ఇస్తుండటంతో విపరీతమైన పోటీ ఎదుర్కొంటున్న అభ్యర్థులు తప్పనిసరి పరిస్థితుల్లో వారి వలలో చిక్కుకుంటున్నారు.

– ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న పార్టీలు....

మునిసిపల్ ఎన్నికల్లో పెద్దమొత్తంలో డబ్బుల పంపిణీకి తెరలేచినట్లు తెలుస్తోంది. కార్పొరేటర్/ కౌన్సిలర్ అభ్యర్థులు కొన్ని చోట్లా రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వెచ్చించేందుకూ సిద్ధపడుతున్నట్లు సమాచారం. ద్వితీయస్థాయి నాయకులకు నిత్యం దావత్‌లు ఏర్పాటు చేయడంతోపాటు ఓటర్లకు అందజేసేందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు మద్దతిస్తున్న అభ్యర్థులు ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మునిసిపల్ ఎన్నికలను అధికార పార్టీ కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్‌లు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తమ పార్టీ మద్దతునిస్తున్న అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఆయా పార్టీల ముఖ్య నేతలు సైతం డబ్బులు వెదజల్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీలైనన్ని వార్డులను తమ ఖాతాల్లో వేసేకోవడానికి ప్రధాన పార్టీల నేతలు అలుపెరుగని విధంగా కృషి చేస్తున్నారు.

# సీఎం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్, గురువారం సభా ప్రాంగణం పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా సభ నిర్వహించనున్న స్థలం, ప్రముఖులు కూర్చునే డి--రింగ్ భద్రతా ప్రాంతం, ప్రజల కోసం కేటాయించిన విభాగాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, అత్యవసర వాహనాల రాకపోకల మార్గాలను కమిషనర్ సమగ్రంగా తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి రాక కోసం సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సభకు అశేషంగా తరలివచ్చే జనవాహినిని దృష్టిలో ఉంచుకొని వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, పాదచారుల సౌకర్యాలు, భారీ కేడింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్స్ (క్యూ ఆర్ టి) అంబులెన్సులు, ఫైర్ సర్వీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా బందోబస్తు స్కీమ్‌పై స్థానిక పోలీస్ అధికారులు, ఇతర విభాగాలతో సమీక్ష నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణ, గుంపు నియంత్రణ వంటి అంశాలపై కీలక సూచనలు చేశారు. ప్రతి అధికారి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలతో సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.
ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా, విజయవంతంగా ముగిసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని, ఈ సందర్భంగా దాదాపు 1,200 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారని పోలీస్ కమిషనర్ తెలిపారు.
ఈ పరిశీలనలో నిజామాబాద్ జిల్లా అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ బస్వరెడ్డి, అదనపు డీసీపీ (ఏఆర్) శ్రీ రామ్ చంద్రరావు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ మరియు ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ శ్రీశైలం, సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, అలాగే ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూప్-1 నియామకాలకు హైకోర్టు ఓకే

హైదరాబాద్, ఫిబ్రవరి 5
: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నాటి నుంచి విజయవంతంగా చేపట్టిన మొట్టమొదటి గ్రూప్-1 నియామకాలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలను కొట్టేస్తూ సింగిల్ జడ్జి గత ఏడాది సెప్టెంబర్ 9న ఇచ్చిన తీర్పును కొట్టేస్తూ.. హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం 123 పేజీల తీర్పును వెలువరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి, టీజీపీఎస్సీకి, ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న విజయవంతమైన అభ్యర్థులకు భారీ ఊరట లభించినట్లయింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనంలో లోపాలు, డబుల్ హాల్‌టికెట్లు, పరీక్షా కేంద్రాల కేటాయింపు, కొన్ని సెంటర్లలో ఎక్కువమంది ఎంపిక కావడం, ఎంపిక చేసిన అభ్యర్థులను కొన్ని సెంటర్లకు కేటాయించడం, తెలుగు మాధ్యమ అభ్యర్థులపై వివక్ష, ఎవాల్యుయేటర్ల ఎంపికలో లోపాల వంటి కారణాలను చూపుతూ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను కొట్టేయాలని.. గతంలో హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకుల జాబితాను కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు. ఆ తీర్పు చెల్లదని, తప్పులతడకగా ఉందని పేర్కొంటూ టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో రిట్ అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. టీజీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్‌రెడ్డి, కమిషన్ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్ రాజశేఖర్, విజయవంతమైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రతివాదుల (రిట్ పిటిషనర్లు లేదా విజయవంతంకాని అభ్యర్థుల) తరఫున సీనియర్ న్యాయవాదులు రచనారెడ్డి, జి.విద్యాసాగర్, సురేందర్‌రావు తదితరులు వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. "పరీక్షల నిర్వహణలో అసమగ్రత, వివక్ష, భారీ లోపాలు, పేపర్ లీకేజీ వంటి వ్యవస్థీకృత తప్పిదాలు ఏమైనా ఉన్నాయా? అని చూడాల్సి ఉంటుంది. మాల్‌ప్రాక్టీస్ జరిగిందని ఎలాంటి అనుమానాలకూ తావులేని విధంగా నిరూపణ జరగాలి. సింగిల్ జడ్జి మొత్తం పరీక్షలను రద్దు చేసి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని లేదా మోడరేషన్ పద్ధతిలో రీ-ఎవాల్యుయేషన్ చేయాలని తీర్పు ఇచ్చారు. తప్పు జరిగిందని నిర్ధారణకు వచ్చిన తర్వాత రీ-ఎవాల్యుయేషన్ చేస్తే మొదటి ఇచ్చిన మొత్తం మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాలన్న తీర్పు ఎలా అమలవుతుంది? కాబట్టి సింగిల్ జడ్జి తీర్పులో లోపం ఉంది. రెండు హాల్‌టికెట్ల జారీ అక్రమమని సింగిల్ జడ్జి పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రకారం రెండు హాల్‌టికెట్ల జారీపై ఎలాంటి నిషేధం లేదు. ప్రిలిమినరీ పరీక్షలకు, మెయిన్స్ పరీక్షలకు రెండు వేర్వేరు హాల్‌టికెట్‌లు ఇచ్చారు.

## అభివృద్ధి చేస్తామని ఓట్లు అడుగుతారు కానీ

# వారు అభివృద్ధి చేయరు



గెలిచిన తర్వాత రెండున్నర ఏళ్లు ప్రజలకు ముఖం చాటేసిన నాయకులు, మళ్లీ ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారు.
కేవలం రెచ్చగొట్టే మాటలతో, కుల మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి.?మానవత్వమే మా మతం:మనుషులంతా ఒక్కటే. మానవత్వం తర్వాతే మతాలు, కులాలు వస్తాయి.మనకు కావాల్సింది అభివృద్ధి. కామారెడ్డిని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.?కామారెడ్డి ప్రత్యేక మేనిఫెస్టో ముందుకు వెళ్దాం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం మేము ఒక ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించాం.ఇది కేవలం కాగితాల మీద ఉండే హామీ కాదు, ప్రతి వార్డుకు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక. డ్రైనేజీలు, వీధి దీపాలు, మౌలిక వసతుల కల్పనలో మా అభ్యర్థులు మీకు జవాబుదారీగా ఉంటారు.?నేనే పూచీకత్తు , నేనే బాధ్యతమీరు మా అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించండి. కామారెడ్డి పట్టణ అభివృద్ధికి నేనే పూచీకత్తుగా ఉంటాను. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో, పనులను పర్యవేక్షించడంలో నేను ముందుండి నడిపిస్తాను. అభివృద్ధి విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు.
?హస్తం గుర్తుకే మన ఓటు వేయండి
ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయి.ఈ అభివృద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలంటే, కామారెడ్డి పట్టణం అభివృద్ధి పథంలో దూసుకు పోవాలంటే.చేతి గుర్తుకే మీ ఓటు వేసి మా అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాను. అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

## న్యావనందిలో జిపిఓ కార్యాలయం ప్రారంభించిన తహసిల్దార్

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి 5 (ప్రజా జ్యోతి)**
సిరికొండ మండలం న్యావనంది గ్రామంలో ఏర్పాటు చేసిన జిపిఓ కార్యాలయాన్ని గురువారం సిరికొండ తహసిల్దార్ ఆర్. రవీందర్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిపిఓ కార్యాలయందోహదపడుతుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి కింది దీప నరేందర్, ఉప సర్పంచ్ కర్రోళ్ల గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్లు రిక్క ముత్తెన్న, జనార్ధన్, జిపిఓ అధికారి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# బిచ్కుంద 2026 మున్సిపల్ ఎన్నికల ఖర్చులపై అభ్యర్థులకు అవగాహన సదస్సు





**జుక్కల్ ఆర్సి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 05**


రాబోయే మున్సిపల్ ఎన్నికలను సజావుగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ఎన్నికల అభ్యర్థులకు ఎన్నికల వ్యయ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఖర్చు పరిమితులను పాటించాలని అధికారులు సూచించారు.అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఒక లక్ష రూపాయలకు మించి ఖర్చు చేయకూడదని, ప్రతి రూపాయి ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ ద్వారానే జరగాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే ఒక రోజు ముందే ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తెరవాలి, ప్రచారానికి సంబంధించిన అన్ని ఖర్చులు అదే ఖాతా నుంచే చేయాలని తెలిపారు. అలాగే 5 వేల రూపాయలకు మించి నగదు లావాదేవీలు చేయరాదని హెచ్చరించారు.

ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ చేయడం, డబ్బులు పంచడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల అన్ని ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు ముగించాల్సి ఉంటుందని సూచించారు. వాహనాలు, మైకుల వినియోగానికి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని, అనుమతి లేకుండా వాహనాలు తిరిగితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.ఎన్నికల నిబంధనలు పూర్తిగా పాటించి, స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని అభ్యర్థులను కోరారు.

ఈ సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిస్ట్రిక్ట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ ఎండి మహమ్మద్ ఇసాక్ హైమద్, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ ఏ సంతోష్ చారి, జి. రమేష్ తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో పర్యటించనున్న ఏపీ డిప్యూటీ సీఎం

## -మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా
## - ఫిబ్రవరి 7న పవన్ కళ్యాణ్ పర్యటన



**కామారెడ్డి (ఆర్ సి) ఫిబ్రవరి 5(ప్రజా జ్యోతి)**

కామారెడ్డి జిల్లాలో ఈనెల 11న జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫిబ్రవరి 7వ తారీఖున జిల్లా లోని మున్సిపాలిటీ వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం వారి తరపున ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున జనసేన కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు తరలిరావాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. జనసేన పార్టీ నుండి బరిలో ఉన్న అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చాడు.

# క్యాసంపల్లి-రాఘవపూర్ అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

## శ్రీమంతం, అక్షరాభ్యాస కార్యక్రమాలు





**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 5 ప్రజా జ్యోతి**

క్యాసంపల్లి, రాఘవపూర్ గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలను సూపర్వైజర్ పద్మజ గురువారం సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పిల్లలకు అందిస్తున్న పోషణాహారం, హాజరు రిజిస్టర్లు, ఆరోగ్య రికార్డులు, ప్రీ స్కూల్ కార్యకలాపాల నిర్వహణను ఆమె పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు సూచనలు చేశారు.

తనిఖీ అనంతరం క్యాసంపల్లి--రాఘవపూర్ అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారుల కోసం శ్రీమంతం, అక్షరాభ్యాసం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు గ్రామస్తుల సమక్షంలో పండుగ వాతావరణాన్ని తలపించాయి. చిన్నారులను పూలతో అలంకరించి, సంప్రదాయ పద్ధతిలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీ మహిళలకు శ్రీమంతం నిర్వహించి, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు, రాఘవపూర్ సర్పంచ్ వినీల వార్డ్ మెంబర్స్ క్యాసం పల్లి సర్పంచ్ అడుప శ్యామ్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఉప సర్పంచుల వార్డు మెంబర్స్ అంగన్వాడీ టీచర్స్ సిహెచ్ శోభారాణి కె సుజాత కమిటీ రాఘవపూర్ అంగన్వాడి టీచర్ పద్మ మెంబర్స్ గర్భిణీలు పిల్లల తల్లులు గ్రామ పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ ఆయాలు, పాలకవర్గ సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా సూపర్వైజర్ పద్మజ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే పిల్లలకు సరైన పోషణ, విద్య అందిస్తే వారు ఆరోగ్యంగా, మేధావులుగా ఎదుగుతారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు మొదటి విద్యాబాట అని పేర్కొన్నారు. అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని, తల్లిదండ్రుల్లోనూ అవగాహన కలుగుతుందని ఆమె అన్నారు.అలాగే గర్భిణీ మహిళలు, బాలింతలు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పోషణాహారం, టీకాలు, ఆరోగ్య పరీక్షలు సకాలంలో అందేలా అంగన్వాడీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఆమె ఆదేశించారు.గ్రామ సర్పంచులు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కేంద్రాల భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, పిల్లల ఆట వస్తువుల ఏర్పాటు విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామాల్లో విద్య, ఆరోగ్యం పట్ల మంచి అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల సేవలు మరింత బలోపేతం కావాలని కోరారు.ఈ కార్యక్రమం ద్వారా క్యాసంపల్లి--రాఘవపూర్ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యం మరోసారి స్పష్టమైందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ మరమ్మత్తులు చేస్తూ వ్యక్తి మృతి




**రామారెడ్డి ఫిబ్రవరి 05 (ప్రజా జ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులు చేస్తుండగా గురువారం సాయంత్రం విద్యుత్ సప్లై వలనకాటం రవి(45) మృతి చెందడం జరిగింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రామారెడ్డి గ్రామ శివారులోని కట్లేకుంట లింబాద్రి పొలంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ యొక్క ఫ్యూజ్ వైర్ ను పోల్ ఎక్కి సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందడం జరిగింది.ఇట్టి విషయం పై గురువారం మృతుని భార్య కాటం మంజుల ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి శవ పంచనామా చేసి, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించినది అని తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు

**రామారెడ్డి ఫిబ్రవరి 05 (ప్రజా జ్యోతి)**

కామారెడ్డి కాంసెన్సీ తాజా మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ జన్మదిన వేడుకల సందర్భంగా రామారెడ్డి మండల సీనియర్ నేత మంగలి రామచంద్రం కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. తదుపరి మున్సిపల్ ఎన్నికల గురించి చర్చించడం జరిగింది. ఈ యొక్క మున్సిపల్ ఎన్నికలలో ప్రతి ఒక్క కార్యకర్త, తమ వంతు బాధ్యతగా గెలిపే ధ్యేయంగా పొడి చేస్తున్న అభ్యర్థులకు సపోర్టుగా నిలబడి మున్సిపల్ ఎన్నికలలో విజయం సాధించే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు.



# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జిల్లా పర్యటన



**కామారెడ్డి (ఆర్ సి) ఫిబ్రవరి 5 (ప్రజాజ్యోతి)**

పది ఉమ్మడి జిల్లాలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ బరిలో ఉన్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు,అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 5 ప్రజా జ్యోతి**

కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా సేవలందించిన గంప గోవర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇస్రోజీవాడి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇస్రోజీవాడి గ్రామ సర్పంచ్ చిందం మల్లేష్, ఉప సర్పంచ్ సిద్ధం స్వామి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సర్పంచ్ చిందం మల్లేష్ మాట్లాడుతూ గంప గోవర్ధన్ ప్రజాసేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నాయకుడని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల సంక్షేమానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు గంప గోవర్ధన్ అని కొనియాడారు. ఉప సర్పంచ్ సిద్ధం స్వామి మాట్లాడుతూ రాజకీయాల్లో అనుభవం, సమర్థత కలిగిన నాయకుడిగా గంప గోవర్ధన్ గుర్తింపు పొందారని తెలిపారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న సమయంలో పార్టీని, ప్రభుత్వాన్ని సమర్థంగా ముందుకు నడిపించడంలో ఆయన పాత్ర కీలకమైందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాండ్ల శ్రీనివాస్, కొత్త రాజు, బాలమల్లు, దుబ్బాక రవి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు గంప గోవర్ధన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ,



ఆయన ఆయురారోగ్యాలతో ఉండి రాజకీయ జీవితంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. గంప గోవర్ధన్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం కావాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

# జొన్న పంట నష్టంపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

## నష్టపరిహారం వచ్చేలా చర్యలు - హామీ



**గాంధారి, ఫిబ్రవరి 5 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని నేరల్ తాండ, చద్మల్, నాగ్లూర్ గ్రామాల్లో జొన్న పంటకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో



పంటను పరిశీలించారు. రైతులకు తగిన నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. నేరల్ తాండలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్ రాథోడ్ నెహ్రూ, ఏఈఓ సూర్యప్రకాష్, అమీర్, డీలర్ నానక్ సింగ్, బంతియా, వెంకట్, దర్బార్, ధరావత్ ప్రకాష్, కారోబార్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జొన్న పంటను ప్రత్యక్షంగా తనిఖీ చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి రాజలింగం తెలిపారు. అనంతరం గాంధారి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను కూడా తనిఖీ చేసి, యూరియా నిల్వలను ధృవీకరించినట్లు ఆయన వెల్లడించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

# కామారెడ్డిలో ఘనంగా అసెంబ్లీ స్థాయి సీఎం కప్ 2026 క్రీడాపోటీల ప్రారంభం

**కామారెడ్డి: రూరల్ ఫిబ్రవరి 5 ప్రజా జ్యోతి**

కామారెడ్డి అసెంబ్లీ స్థాయి సీఎం కప్ 2026 క్రీడాపోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్), కామారెడ్డి నందు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ అధ్యక్షత వహించగా, టీజీ పిజిటిఏ అధ్యక్షులు స్వామి గౌడ్, కార్యదర్శులు ఎం. జైపాల్ రెడ్డి, కె.పి. అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనకొండ కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలయ్య ఆచారి, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నరసింహా రెడ్డి, బి. సాయి మౌర్య తదితరులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని వక్తలు పేర్కొన్నారు.

పోటీల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ పూర్ణచంద్రరావు, పీఎంసీ ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ గారు హాజరై, విజేతలైన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

విజేతల వివరాలు:

కోకో (గర్ల్స్): విజేత -- పాల్వంచ । రన్నర్స్ -- గర్గుల్
గర్ల్స్ విభాగం: విజేత -- పాల్వంచ । రన్నర్స్ -- బీబీపేట్
కబడ్డీ (గర్ల్స్): విజేత -- కామారెడ్డి అర్బన్ । రన్నర్స్ -- పాల్వంచ
కబడ్డీ (బాయ్స్): విజేత -- మాచారెడ్డి । రన్నర్స్ -- బిక్నూర్

ఈ క్రీడాపోటీలు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# వైభవంగా సహస్ర ఘటాభిషేకం





**సదాశివనగర్ ఫిబ్రవరి 5 (ప్రజాజ్యోతి)**

సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామంలోని శ్రీ ఖండేరాయ మహాదేవుని 23వ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాన్ని రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. వేద పండితుల, పురోహితుల మంత్రోచ్ఛరణాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కళశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారి మూల విరాట్ కు సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# సీఎం కప్‌లో గాంధారి మండలం విజయం




**గాంధారి, ఫిబ్రవరి 5 (ప్రజాజ్యోతి)**

ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా గురువారం కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో గాంధారి మండలం జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రేణుక చౌహాన్, ఎంపీడీఓ రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ పరమేశ్‌తో పాటు పీఈటీలు పాల్గొన్నారు. క్రీడల్లో యువత మరింత ముందుకు రావాలని, ఇలాంటి పోటీలు వారి ప్రతిభను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అల్లాపూర్‌లో తాగునీటి సౌకర్యానికి శ్రీకారం

**పిట్లం, ఫిబ్రవరి 5, (ప్రజా జ్యోతి)**

పిట్లం మండల కేంద్రంలోని అల్లాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తాగునీటి సమస్యకు పరిష్కారంగా బోర్ ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాభివృద్ధికి ప్రజాపాలన కార్యక్రమాలు దోహదపడుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ బోర్ ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ పోచయ్య, ఉప సర్పంచ్ కోలన్ నాగేందర్ రెడ్డి, వార్డ్ సభ్యుడు పాపి రెడ్డి, మోహన్ రెడ్డి, మల్లేశం, లింగం, పండరి రావు, మల్లేశం, సాయిరాం, శ్రీనివాస్, పాల్గొన్నారు



# భక్తి శ్రద్ధలతో పిస్కిల్ గుట్ట తాండలో ఆలయ వేడుకలు

**గాంధారి, ఫిబ్రవరి 5 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని పిస్కిల్ గుట్ట తాండలో గురువారం 10వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శివాలయం, జై భవాని, జై సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించడంతో పాటు భోగ్ బండారు కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో పిస్కిల్ గుట్ట తాండ సర్పంచ్ బాదవత్ రేన బాయి--రాములు, మోతిలాల్ నాయక్, రవీందర్ కారోబార్, ఉపసర్పంచ్ రాందాస్, చత్రు, దేవిసింగ్, దుండ, భవసింగ్, వెంకట్రామ్, గోవింద్, వార్డు మెంబర్ ప్రకాష్, పరుశురాం, సురేందర్, సాయిరాం, లచ్చిరాం, రాజు, దశరత్, మోతిలాల్, సంతోష్, హీరాలాల్, మహేందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించడంతో తాండా మొత్తం భక్తిమయ వాతావరణం నెలకొంది. గ్రామ అభివృద్ధి, ప్రజల సుఖశాంతుల కోసం దేవతలను ప్రార్థించామని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఇస్రోజీవాడి గ్రామానికి మహిళా సంఘం మంజూరూ

**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 5 ప్రజా జ్యోతి**

గ్రామాభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభంగ్రామ పాలకవర్గ సభ్యులకి మహిళా సంఘ సభ్యులు శుభాకాంక్షలునెల రోజుల్లోనే అభివృద్ధి చేసి చూపిస్తాం : గ్రామ పాలకవర్గం ప్రతినిధుల ధీమాఇస్రోజీవాడి గ్రామానికి మహిళా సంఘం మంజూరు కావడం గ్రామ ప్రజలకు శుభవార్తగా మారింది. మహిళల సాధికారత, గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గ్రామ చరిత్రలో ఒక కీలక మైలురాయిగా గ్రామస్తులు అభివర్ణిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ పాలకవర్గ సభ్యులు తెలియజేశారు. గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళా సంఘం ద్వారా గ్రామం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. పదవిలోకి వచ్చిన నెల రోజులకే అభివృద్ధి దిశగా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని మహిళా సంఘం ప్రతినిధులు తెలిపారు. పారిశుధ్యం, స్వయం ఉపాధి, మహిళల ఆర్థికాభివృద్ధి, గ్రామ సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తూ ఇస్రోజీవాడిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వారు పేర్కొన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభ్యుదయమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధిలో అన్ని వర్గాల సహకారంతో సమిష్టి కృషి కొనసాగిస్తామని మహిళా సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత భారీ సంఖ్యలో పాల్గొని మహిళా సంఘానికి పూర్తి మద్దతు ప్రకటించారు. మహిళా సంఘం మంజూరుతో గ్రామంలో నూతనోత్సాహం నెలకొందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# పాఠశాలల పనితీరుపై జిల్లా విద్యాధికారి సమీక్ష






**నిజాంసాగర్ ప్రజా జ్యోతి ఫిబ్రవరి 5**

కామారెడ్డి జిల్లా విద్యాధికారి ఎస్. రాజు గురువారం నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యాస స్థాయిని ఆయన సమగ్రంగా పరిశీలించారు. అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా విద్యాధికారి, ఒకటో తరగతిలో విద్యార్థులను ఆంగ్ల పదాల స్పెల్లింగ్స్ రాయమని సూచించగా, విద్యార్థులు సక్రమంగా రాయడం గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నాలుగో తరగతిని పరిశీలించి, మూడో తరగతిలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమాలు, ఎఫ్ఎల్ఎస్ యాక్షన్ ప్లాన్, మార్క్ టెస్ట్--1, టెస్ట్--2 పత్రాలను పరిశీలించారు. పాఠశాలలోని ఎఫ్ఎల్ఎక్స్ ల్యాబ్‌ను కూడా పరిశీలించి, వెనుకబడిన విద్యార్థులకు అవసరమైన ఉపాధ్యాయ సహాయంపై వివరాలు తెలుసుకున్నారు. మూడో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఒకటో తరగతిలో ఆంగ్ల బోధన నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు మౌనిక తరగతిని పరిశీలించి, విద్యార్థుల ప్రతిస్పందనను అభినందించారు. పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను పరిశీలించి, ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసించారు.

తదుపరి అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి, పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలాగానే ఈ విద్యా సంవత్సరం కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వివరాలను తెలుసుకుని, పరీక్షల సమయంలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ధైర్యంగా హాజరుకావాలని సూచించారు.

అదేవిధంగా నిజాంసాగర్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా విద్యాధికారి, ఈ నెల 7వ తేదీన జరగనున్న 9వ, 11వ తరగతుల లాటరల్ ఎంట్రీ ఎంట్రెన్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించి నియమించబడిన చీఫ్ సూపరింటెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో 10 పరీక్ష కేంద్రాలు, నిజాంసాగర్‌లో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాంబాబు, నిజాంసాగర్ మండల విద్యాధికారి వై. తిరుపతిరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ వెంకట్రామిరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. లాల్ సింగ్, ఉపాధ్యాయులు డి. సాయి ప్రసాద్, ఎం. మౌనిక, డి. సుష్మ, జోసెఫ్ రత్నాకర్, సమత, రమాదేవి, సంతోష్, ప్రవీణ్, జావీద్ అలీ, సీఆర్పీలు ఏం. వరలక్ష్మి, బి. శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా మైదానానికి స్థల కేటాయింపు

## గ్రామ అభివృద్ధి కమిటీ తీర్మానం పత్రం అందజేత



**గాంధారి, ఫిబ్రవరి 5 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండల కేంద్రంలోని బోగేశ్వరాలయంలో గురువారం గాంధారి గ్రామ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గాంధారి ప్రజలు, యువత ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్న క్రీడా మైదానం నిర్మాణానికి మొకరంపేట్ హనుమాన్ ఆలయం సమీపంలోని స్థలాన్ని కేటాయించేందుకు గ్రామ పెద్దల సమావేశంలో గ్రామ అభివృద్ధి కమిటీ పాలకవర్గం గత నెలలో తీర్మానం చేసినట్లు వెల్లడించారు. అట్టి తీర్మాన పత్రాన్ని గురువారం జరిగిన అందరి పెద్దల సమావేశంలో గాంధారి క్రీడా అభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులకు అధికారికంగా అందజేశారు. క్రీడల అభివృద్ధితో పాటు యువతకు సరైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. గ్రామంలో క్రీడా వాతావరణం పెంపొందించేందుకు ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి హోరాహోరీ ప్రచారం

**ప్రజా జ్యోతి కామారెడ్డి టౌన్ ఫిబ్రవరి 5**

కామారెడ్డి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి ప్రభుత్వ సలహాదారుడు, బిజెపి నుండి ఎమ్మెల్యే రమణారెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నుండి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ బిజెపి మధ్య ప్రచారం కొనసాగుతుంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నుండి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ వార్డుల్లో పర్యటిస్తున్నారు అధికార పార్టీలో ఉన్నందున కామారెడ్డి అభివృద్ధి చెందాలంటే అధికార కాంగ్రెస్ పార్టీ చెందిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా కామారెడ్డికి ప్రత్యేక ప్రణాళికతో మేనిఫెస్టోను విడుదల చేశారు, అభ్యర్థులకు ఎన్నికల్లో ఏ విధంగా దిశా నిర్దేశం చేశారు. ప్రచారానికి కేవలం నాలుగు రోజులు సమయం రోజుకు రెండు విడతలుగా అంతా తానై ప్రచారం నిర్వహిస్తున్నారు. బిజెపి పార్టీ నుండి ఎమ్మెల్యే రమణారెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. అవినీతి అవినీతి రహిత పాలన అందించడానికి మేము సిద్ధంగా ఉన్నామని రమణారెడ్డి అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు, ఎమ్మెల్యేగా ఉండి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయాలని ప్రణాళికతో ముందుకు సాగుతున్నాడు. కానీ అధికార పార్టీ ముందు మరి బిజెపి జెండా ఎగర వేస్తుందా లేదో చూడాలి. బిఆర్ఎస్ పార్టీ నుండి మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కొంచెం వెనుకబడినట్టు కనిపిస్తుంది.

# కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

## ధర్మరావుపేట సర్పంచ్ షేక్ ఉమర్

**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 5 ప్రజా జ్యోతి**

ధర్మ రావు పేట గ్రామానికి చెందిన సర్పంచ్ షేక్ ఉమర్ మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ వీఫ్ గంప గోవర్ధన్‌కు జన్మదిన సందర్భంగా ధర్మరావుపేట గ్రామ సర్పంచ్ షేక్ ఉమర్, రాజారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ ఉమర్ మాట్లాడుతూ గంప గోవర్ధన్ ప్రజాసేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని, కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. గంప గోవర్ధన్ ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# ధర్మారావు పేటలో ఇందిరమ్మ ఇండ్ల వద్ద మార్కింగ్ కార్యక్రమం

## హరిజనవాడలో మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు

**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 5 ప్రజా జ్యోతి**

ధర్మారావు పేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పతకం లో భాగంగా లబ్ధిధారులకు మార్కింగ్ ,ప్రోసీడింగ్ పంపిని చేయడం జరిగింది అదేవిధంగా గ్రామంలోని హరిజనవాడలో నీటి సమస్యను పరిష్కరించేందుకు మిషన్ భగీరథ పైపులైన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నో రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ పైపులైన్ ద్వారా శుద్ధమైన తాగునీరు అందనుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ ఉమర్ ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామంలోని ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నామని వారు తెలిపారు. ముఖ్యంగా మిషన్ భగీరథ ద్వారా గ్రామంలో శాశ్వత నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న



పాలకవర్గానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, స్థానికులు పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండండి

**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 5**

నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోమున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్ గా నిలబడిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనుచేతు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించండి -భీంగల్ పట్టణ ప్రజలకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ విజ్ఞప్తి.భీంగల్ పట్టణ అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కోరారు.ఈ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పట్టణ ప్రజలకు ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందించాలని గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వక ప్రజలను మోసం చేసిందని ఆయన అన్నారు. ఒక్క భీంగల్ పట్టణానికే 200 లకు పైగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని ఇప్పుడు ఆ ఇండ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. భీంగల్ పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామని అన్నారు. భీంగల్ పట్టణ అభివృద్ధిని గత ప్రభుత్వం పక్కన పెట్టిందని కానీ ఈ ప్రజా ప్రభుత్వం ప్రతి వార్డులో మురికి కాలువలు సిసి రోడ్ల నిర్మాణం కొరకు మరియు త్రాగునీటి సదుపాయం కొరకు 54 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని పనులన్నీ నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు.భీంగల్ పట్టణంలో గల కేజీబీవీ పాఠశాలను 40 లక్షల



రూపాయలతో మరమ్మతులు చేయించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. భీంగల్ మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు.కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ ఈరావతి అనిల్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి చైర్మన్ అన్వేష్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అడవి పందిని అక్రమంగా వేటాడిన వ్యక్తిపై కేసు

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి,5 (ప్రజా జ్యోతి)**

సిరికొండ మండలంలోని న్యావనంది బీట్ పరిధిలోని కంపార్ట్మెంట్ నెంబర్ 398లో గురువారం ఉదయం 10 గంటల సమయంలో అడవి పందిని పట్టుకుని అక్రమంగా కాల్చుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు.అక్కడ నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన ధర్కట్ల రవితేజ అనే వ్యక్తి అడవి పందిని వేటాడి కాల్చినట్లు గుర్తించడంతో, అతనిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం--1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు సిరికొండ రేంజ్ అధికారి కె. నర్సింగ్ రావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణ చట్టం--1972 ప్రకారం ప్రతి అడవి జంతువుకు జీవించే హక్కు ఉందని, వాటిని చంపే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. అడవి జంతువులను వేటాడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అడవి జంతువుల వల్ల పంట నష్టం జరిగితే రైతులు రెవెన్యూ, వ్యవసాయ మరియు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమర్పించే నివేదికల ఆధారంగా అటవీ శాఖ ద్వారా నష్టపరిహారం చెల్లించబడుతుందని తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.6,000, ఇతర పంటలకు ఎకరానికి రూ.7,500 చొప్పున నష్టపరిహారం అందజేస్తామని వెల్లడించారు.రైతులు గానీ, గ్రామ ప్రజలు గానీ అడవి జంతువులను వేటాడే ప్రయత్నాలు చేయకూడదని, అలా చేస్తే అటవీ శాఖ చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని రేంజ్ అధికారి కె. నర్సింగ్ రావు హెచ్చరించారు.



## మానవత్వాన్ని చాటుకున్న గ్రామస్తులు



**కామారెడ్డి (ఆర్ సి) ఫిబ్రవరి 5 బిక్కనూరు (ప్రజాజ్యోతి)**

భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామంలో గత మూడు సంవత్సరాలుగా ఒక కొండముచ్చు ఎక్కడినుండి వచ్చిందో తెలియదు కానీ గ్రామ ప్రజలతో మమేకమై అందరితో కలివిడిగా ఉంటూ గ్రామస్తులు ఇచ్చిన పండ్లు, ఫలాలను తింటూ ఇన్నాళ్లు జీవనం సాగించింది. ఏం జరిగిందో తెలియదు గానీ గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మృతి చెంది ఉండడానికి గుర్తించిన స్థానికులు గ్రామ సర్పంచ్ కుంట లింగారెడ్డి కి సమాచారాన్ని ఇవ్వడంతో, వెంటనే స్పందించిన సర్పంచ్, గ్రామపంచాయతీ సిబ్బంది మనుషులకు చేసిన విధంగానే అంత్యక్రియలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుంట లింగారెడ్డి మాట్లాడుతూ... గత మూడు నాలుగు సంవత్సరాలుగా గ్రామంలో ఉన్నప్పటికీ ఎవరికీ ఎటువంటి హాని కలిగించకపోవడమే కాకుండా కోతుల బెడదను కొంతమేరకు కొండముచ్చు తప్పించిందని, ఇలాంటి మూగ జీవి ఆకస్మిక మరణం మనసుకు బాధగా ఉందని ఆయన తెలిపాడు.

## స్టేషన్ తండాలో రేషన్ షాప్ ప్రారంభోత్సవం



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్ ) ఫిబ్రవరి. 5**

ఇందల్వాయి మండల కేంద్రంలోని స్టేషన్ తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును గ్రామ సర్పంచ్ భారతి జగత్ సింగ్ పవర్ ఉపసర్పంచ్ శ్రీనివాస్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో అనంతరావు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంగా ప్రసాద్ హాజరయ్యారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భారతి జగత్ సింగ్ మాట్లాడుతూ రేషన్ షాప్ ప్రారంభోత్సవం తాండ ప్రజలకు నిత్యవసర సరుకులు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమంగా చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీడీవో అనంతరావు మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ ప్రభుత్వ లక్ష్యమని దేశం పంపిణీ ప్రక్రియ నిబంధనలు సహకారం పారదర్శకంగా జరగాలని సూచించారు మండల కేబుల్ న్యూస్ పేపర్ గంగ ప్రసాద్ మాట్లాడుతూ చేరుగా లబ్ధిదారులకు చేరవలసిన సరుకులు లబ్ధిదారులకు అందించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ యువకులు, పెద్దలు తాండవాసులు పాల్గొన్నారు

## మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష

**మెండోరా: ఫిబ్రవరి /05 (ప్రజా జ్యోతి)**

మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన ఇద్దరికీ నాలుగు రోజుల జైలు శిక్ష పడినట్లు మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని తెలిపారు. మెండోరా గ్రామానికి చెందిన బేగారి రవి , నిర్మల్ కి చెందిన బాలకిషన్ అను వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడిపి పట్టుపడగా అట్టి వ్యక్తులను సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందర ప్రవేశపెట్టగా మేజిస్ట్రేట్ వారికి 4 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఆమె తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజల ప్రాణ భద్రత కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## పోస్టల్ బ్యాలెట్ కేంద్రం, పోలింగ్ సామగ్రిని పరిశీలించిన సబ్ కలెక్టర్.

**బోధన్ ఫిబ్రవరి 05 (ప్రజాజ్యోతి)**

బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని గురువారం బోధన్ సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సక్రమంగా ఓటింగ్ ప్రక్రియ కొనసాగాలని అధికారులకు సూచించారు.అనంతరం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు అవసరమైన పోలింగ్ సామగ్రి జాబితాను సబ్ కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ రోజున ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, సామగ్రి సరఫరాలో నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

